డైరీ ఆవిష్కరణ

పార్వతీపురం రూరల్ : జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు సంఘం, వెటర్నరీ సర్జన్స్ సర్వీస్ సంఘం సంయుక్తంగా ముద్రించిన 2024 సంవత్సరం డైరీని గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి డాక్టర్ జె.రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పటిష్టంగా ఉండేందుకు సభ్యులు తమ సేవలను అందించాలని కోరారు.

విన్నర్ ఇంటికి... రన్నర్ ఫైనల్‌కు

- ఆడుదాం ఆంధ్రా క్రికెట్ టీంలో అధికారుల కిరికిరి
- రాజకీయ ఒత్తిళ్లేనంటున్న బాధిత క్రీడాకారులు

ఆడుదాం ఆంధ్ర అపహాస్యం పాలవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆటల పోటీల్లో మితిమీరిన రాజకీయ జోక్యం ఎక్కువైంది. ఆఖరుకు గెలిచిన టీమును రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఫైనల్స్‌కు పంపకుండా ఓడిన టీమ్‌ను అధికారులు పంపారు. దీంతో గెలిచిన టీం సభ్యులు తమకు జరిగిన అన్యాయంపై రోడ్డెక్కారు...

ప్రజాశక్తి -సాలూరు

ఈనెల 2,3 తేదీల్లో పార్వతీపురంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్రికెట్ విభాగంలో పాచిపెంట మండల టీం జిల్లా స్థాయి పోటీలో పార్వతీపురం టీంపై విజయం సాధించింది. ఈ విధంగా గెలిచిన పాచిపెంట టీంకు కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతులు మీదుగా షీల్డ్, ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా స్థాయి క్రికెట్‌లో అగ్రగామిగా నిలిచిన పాచిపెంట టీంను డిప్యూటీ సీఎం రాజన్నదొర కూడా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన కోరిన విధంగా నే పాచిపెంట టీం రాష్ట్ర స్థాయి క్రికెట్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇది జరిగి నాలుగు రోజులయింది. ఫైనల్ పోటీలు ఈనెల 9న విశాఖపట్నంలో జరుగనున్నాయి.నిబంధనల ప్రకారం గెలిచిన పాచిపెంట టీంను మన్యం జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించాల్సి ఉంది. అయితే అనూహ్యంగా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు ఓడిపోయిన పార్వతీపురం టీంను ఫైనల్స్‌కు పంపించారు. రాష్ట్ర స్థాయి ఫైనల్‌కు అర్హత సాధించిన తమను ఎందుకు పిలవలేదని గురువారం పాచిపెంట టీం సభ్యులు జిల్లా కార్యాలయానికి వెళ్లారు. పాచిపెంట టీం తరపున బయట క్రీడాకారులతో ఓడించారని, అందుకే ఫైనల్‌కు పంపించ లేదని అధికారులు చెప్పడంతో వారు ఖంగుతిన్నారు. తీవ్ర ఆవేదనకు గురైన పాచిపెంట టీం సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అయినా అధికారులు పట్టించుకోకుండా దొడ్డిదారిలో ఓడిన టీంను ఫైనల్స్ కి పంపించారు. పాచిపెంట టీం లో బయటి క్రీడాకారులు ఉంటే ఫైనల్ పోటీ జరుగుతున్న సమయంలో అధికారులు ఎందుకు తప్పు పట్టలేదనే ప్రశ్న ఉదయస్తోంది. జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్‌లో విజేతగా ప్రకటించి కలెక్టర్ చేతులు మీదుగా షీల్డ్, ధ్రువపత్రాలు అందుకున్న నాలుగు రోజుల తర్వాత ఓడిన టీం ఫిర్యాదు మేరకు విచారించి చర్యలు తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాచిపెంట టీం జిల్లా స్థాయిలో ఫైనల్ పోటీల్లో పాల్గొనడానికి ఆ మండల పరిధిలోని క్రీడాకారులు, నియోజకవర్గ పరిధిలోని ఇతర మండలాల క్రీడాకారులు కూడా అర్హులని నిబంధనలు చెపుతున్నాయి .ఒకవేళ పాచిపెంట టీం తరపున ఆ మండల పరిధిలోని క్రీడాకారులు కాకుండా నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారులు కాకుండా పక్క నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులతో గాని, ఇతర జిల్లాల క్రీడాకారులతో గాని ఆడిస్తే నిబంధనలకు విరుద్ధమవుతుంది. కానీ పాచిపెంట మండలానికి చెందిన వారితోపాటు నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారులతో టీం ఆడింది. నిబంధనల ప్రకారం ఇది తప్పు కాదని పాచిపెంట టీం కెప్టెన్ పి.ఉమామహేశ్వరరావు చెప్పారు.రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ ఎడి నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే పాచిపెంట టీం తరపున క్రీడాకారులతో ఆడామని చెప్పారు. జిల్లా అధికారుల పక్షపాతం, రాజకీయ జోక్యం వల్లనే తమకు అన్యాయం జరిగిందని ఆయన వాపోయారు.

అధికారుల పనితీరుకు నిదర్శనం

డిప్యూటీ సీఎం రాజన్నదొర

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పట్ల జిల్లా అధికారుల పనితీరుకు ఇది నిదర్శనం. గెలిచిన పాచిపెంట టీంలో బయటి క్రీడాకారులు వున్నారని ఫైనల్ పోటీ సమయంలోనే తేల్చాలి. అలా కాకుండా ఫైనల్ విజేతగా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్న నాలుగు రోజుల తర్వాత బయటి క్రీడాకారులు ఏన్నారని ఫిర్యాదు చేయడం, విచారణ చేపట్టడం విడ్డూరంగా ఉంది. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, ఇతర అధికారుల పనితీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే పరిస్థితి ఉంది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర క్రీడాభివృధికారులకు ఫిర్యాదు చేశా. సిఎం జగన్ మోహన్‌రెడ్డికి కూడా ఫిర్యాదు చేస్తాం. విచారణ జరిపిస్తా. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన పాచిపెంట టీమ్ క్రీడాకారులు

రోడ్డుపై బైఠాయించిన క్రీడాకారులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా కేంద్రంలో గురువారం పాచిపెంట మండలం క్రికెట్ క్రీడాకారులు ఆందోళన చేపట్టారు. స్థానిక ఆర్‌టిసి కూడలిలో రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి క్రికెట్ ఫైనల్‌లో తాము పార్వతీపురం జట్టుపై విజయం సాధించి విన్నర్లుగా నిలిచామని, ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ట్రోఫీని కూడా అందుకున్నామని తెలిపారు. ఆ తరువాత జరిగిన పరిణామాలలో తమపై ఓడిపోయిన పార్వతీపురం జట్టును రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తున్నారని, దీనికి కారణం జిల్లా స్పోర్ట్స్ అధికారి, ఆయనతోపాటు స్థానిక రాజకీయ నాయకులు అని ఆరోపించారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారులు ఈ సంఘటనపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

విచారణ ఎప్పుడు జరిగింది?

జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్ విజేతగా నిలిచిన పాచిపెంట టీంలో బయటి క్రీడాకారులు వున్నట్టు ఓడిన టీం సభ్యులు ఫిర్యాదు చేస్తే వారిని విచారణకు ఎందుకు పిలవలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. గెలిచిన , ఓడిన టీం సభ్యులను ఎదురెదురుగా పెట్టి జిల్లా అధికారులు విచారణ జరపకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫైనల్‌కు అర్హత సాధించామని సంబరాల్లో ఉన్న పాచిపెంట టీం గురువారం ఉదయం జిల్లా అధికారులను ప్రశ్నించినప్పుడు మాత్రమే బయటి క్రీడాకారులతో ఆడారని, అందుకే ఫైనల్ కి పంపించలేదని చెప్పారు. జిల్లా స్థాయి ఫైనల్ పోటీలు జరిగి నాలుగు రోజుల తర్వాత గెలిచిన పాచిపెంట టీం కి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వివాదాస్పద మవుతోంది.

రాజకీయ ఒత్తిళ్లు కారణంగానే

రాష్ట్ర స్థాయి క్రికెట్ ఫైనల్‌ను ఓడిపోయిన పార్వతీపురం టీంను పంపించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు వున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారపార్టీకి చెందిన నియోజకవర్గ ప్రజాప్రతినిధి జోక్యం వల్లనే తమకు అన్యాయం జరిగిందని పాచిపెంట టీం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయటి క్రీడాకారులతో ఆడించారు

డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు

పాచిపెంట టీం లో బయటి క్రీడాకారులతో ఫైనల్ పోటీల్లో ఆడించారని పార్వతీపురం టీం సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణలో అది నిజమని తేలింది. అందుకే ఓడిన టీంను ఫైనల్స్‌కు పంపించాం.

వేలల్లో అభ్యర్థులు..
వందల్లో పోస్టులు

- 284 ఉపాధ్యాయ ఖాళీలకు నోటిఫికేషన్
- ఎస్‌జిటి.. 103, ఎస్‌ఎ 97 పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు ఐదేళ్లుగా వేల సంఖ్యలో అభ్యర్థులు డిఎస్‌సి కోసం సన్నద్ధమవుతున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందో అంటూ కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. ఐదేళ్ల సుదీర్ఘ నిరీక్షకు తెరదించుతూ అత్తెసరు పోస్టులతో ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. వేలల్లో అభ్యర్థులుంటే, వందల సంఖ్యలో పోస్టులను ప్రకటించి, వారి ఆశలను ప్రభుత్వం అడియాసలు చేసింది. ఐదేళ్లుగా లక్షల రూపాయలు ఖర్చు చేసి డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులను తక్కువ పోస్టుల సంఖ్య ప్రకటించడంతో మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

డిఎస్‌సి అభ్యర్థులతో కిక్కిరిసిన రీడింగ్ రూం

మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం.. కేవలం రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మన జిల్లాకు ఎన్ని పోస్టులోనని ఎదురు చూసిన అభ్యర్థులు.. విద్యాశాఖా మంత్రి బొత్స సత్య నారాయణ ప్రకటనతో తీవ్ర నిరాశకు గురయ్యారు. మంత్రి బొత్స ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కాబట్టి ఎక్కువ పోస్టులు కేటాయిస్తారని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. ఉమ్మడి జిల్లాకు కేవలం 284 పోస్టులు కేటాయించినట్లు ప్రకటించడంతో అభ్యర్థులు ఉసూరుమన్నారు. అందులో ఎస్‌జిటి పోస్టులు 103, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 97 భర్తీ చేయనున్నట్లు తెలియడంతో మరింత నిర్వేదనకు గురిచేసింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ఏ సబ్జెక్టుకు ఎన్ని పోస్టులో అనేది కూడా స్పష్టంగా ఇవ్వలేదు. మరోవైపు జెడ్‌పి, ప్రభుత్వ, మున్సిపాలిటీ, గిరిజన ప్రాంతాలకు ఎన్ని పోస్టులో కూడా స్పష్టంగా చెప్పలేదు. దీంతో నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఆందోళన కొనసాగుతోంది.

ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తక్కువ కావడం ఒకెత్తయితే, ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో పోస్టులు భర్తీ చేస్తారా? అనే సందేహాన్ని అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల్లో సాధారణ ఎన్నికలు నోటిఫికేషన్ రానుండటంతో డిఎస్‌సి నిర్వహిస్తారా? లేదా? అన్న సందేహాలు అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్నాయి. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈపాటికే డిఎస్‌సి నిర్వహించాల్సి ఉంది. కేవలం ఎన్నికల కారణంగానే ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చిందనే చర్చ సాగుతోంది.

ఐదేళ్లుగా నిరీక్షణ

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 18 వరకు బిఇడి కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల నుంచి ఏటా సుమారు 900 మంది రిలీవ్ అవుతున్నారు. మరో వైపు డైట్ కాలేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒకటి, ప్రయివేటు కళాశాలలు 8 వరకు ఉన్నాయి. ఈ కళాశాలల నుంచి ఏటా 800 మంది వరకు రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తిచేసి ఉద్యోగాలు రానివారు వేలాది మంది ఉన్నారు. టిడిపి హయాంలో 2018 అక్టోబరు 25న చివరి సారిగా నోటిఫికేషన్ వెలువడగా, 2019 జనవరితో పరీక్షలు పూర్తయ్యాయి. ఆ తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు జరగలేదు. ఐదేళ్లుగా డిఎస్‌సి కోసం ఈ నేపథ్యంలో గత డిఎస్‌సికి హాజరైన వారికి రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ఆదివాసీ గిరిజన సంఘం ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని జిల్లేడువలస, బొర్ర పణుకువలస గ్రామాల్లో నిరుపేద గిరిజనులు సాగు చేస్తున్న అటవీ, బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ధర్నా చేపట్టారు. సంఘం అధ్యక్షులు గెమ్మెల జానకీరావు, కార్యదర్శి వంతల సుందరరావు ఆధ్వర్యాన గిరిజనులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లేడువలస, బొర్రా పణుకువలస గ్రామాల్లో అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. అనంతరం తహశీల్దార్ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, చేతివృత్తి దారుల సంఘం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రతిఒక్కరికీ సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గ్రామాల్లో చేపడుతున్న సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు 0 నుండి 40 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరికీ చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. గురువారం కుసిమి పిహెచ్‌సిని పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. సికిల్ సెల్ ఎనీమీయా పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఇంకా గ్రామాల్లో, పాఠశాలల్లో టెస్టులు చేసుకోనివారుంటే వారిని గుర్తించి పరీక్షలు చేయాలని అన్నారు. ప్రతిరోజు చేసిన పరీక్షల రిపోర్టులను ఐటిడిఎ కార్యాలయానికి అందజేయాలని అన్నారు. అనంతరం హడ్డుబంగి, కె.గుమ్మడలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పిల వద్ద ఉన్న సికిల్ సెల్ ఎనీమీయా పరీక్షల రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

పార్వతీపురం : జాతీయ లోక్ అదాలత్ మార్చి 9న జరుగుతుందని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ లోక్ అదాలత్‌ను స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కరించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు డి వార్మింగ్ డే

పార్వతీపురం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంను శుక్రవారం నిర్వహించేందుకు అన్ని సిద్ధం చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బగాది జగన్నాథ రావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 1,75,891 మంది చిన్నారులు, ఈ మాత్రలు వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 1,75,891 మంది బాలబాలికలు ఉన్నారని తెలిపారు. వీరందరికీ అల్బండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు.

నిర్బంధాలతో పోరాటాలు ఆపలేరు

అక్రమ అరెస్టులను ఖండిస్తూ కలెక్టరేట్ వద్ద ఆశాలు, సిహెచ్‌డబ్ల్యుఒల నిరసన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయడానికి విజయవాడ వెళ్లనీయకుండా అడ్డుకోవడం తగదని, తప్పు నిర్బంధాలతో పోరాటాలు ఆపలేరని ఎపి ఆశా వర్కర్స్, సిహెచ్‌డబ్ల్యుల సంఘం తెలిపింది. ఆశా వర్కర్ల అక్రమ అరెస్ట్‌లను నిరసిస్తూ వెంటనే వారిని విడుదల చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఆశా వర్కర్లను, సిఐటియు నాయకులను గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉమ్మడిగా తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు కావస్తున్నా తమ సమస్యలు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించినందున పోరాటాలు జరుగుతున్నాయని, సంక్షేమ పథకాలు గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి ఆ సంక్షేమ పథకాలు ఆశా వర్కర్లకు అందుతున్నాయా లేదా తెలుసా అని ప్రశ్నించారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు పని ఎక్కువ జీతం తక్కువ అని, అలాంటప్పుడు ప్రశ్నించే వారి గొంతు నొక్కే అర్హత ఈ ప్రభుత్వానికి లేదని తెలిపారు. న్యాయంగా పోరాడుతున్న వారిని పోలీసులతో అడ్డుకోవడం సరికాదని, గొంతు నొక్కే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఆశా వర్కర్ల సంఘం నాయకులు ఎం.శివాని మాట్లాడుతూ తమను విజయవాడ వెళ్లనీయకుండా గృహనిర్బంధాలు చేశారని, 149, 151 కేసులు పెట్టారని, తాము ఏం నేరం చేశామని, తమ సమస్యలపై ప్రభుత్వాన్ని అడగడం తప్పాని ప్రశ్నించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు బి సూరిబాబు, వి.ఇందిర, అబ్దుల్లా, జ్యోతి, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు

సాలూరు : తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు, నాయకులు

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు గురువారం చేపట్టిన చలో విజయవాడకు వెళ్ళకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, సంఘం నాయకులు శ్రీదేవి ఆధ్వర్యాన వారు మున్సిపల్ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం హెచ్ డిటి భాను ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చేయాలని, రూ.10లక్షల ప్రమాదభీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వీరి ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు మద్దతు పలికారు.

పాలకొండ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు విజయవాడ చేరుకుంటున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించి నిర్బంధించడాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు. దావాల రమణారావు ఖండించారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్ల న్యాయమైన సమస్యలను సామరస్యంగా యూనియన్‌తో చర్చించి పరిష్కారానికి కృషి చేయకుండా అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో భయపెట్టి ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మిని చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకుండా ఆమెను పోలీసులు నిర్బంధించడం దారుణమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లపై నిర్బంధం చేశారని, అరెస్ట్ చేసిన ఆశావర్కర్లు అందర్నీ తక్షణమే విడుదల చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏజెన్సీలో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ప్రతినిధుల పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జాతాపు భాషలో పాఠ్యపుస్తకాలు తయారీ కోసం యూనివర్సిటీ మైసూర్ నుంచి సెంట్రల్ ఇన్సిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ వారు మండలంలోని గొరడ, రేగిడి గిరిజన ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. వీరు అంగన్వాడీలను, పాఠశాలలను పరిశీలించి ఆయా గ్రామస్తులతో మమేకమయ్యారు. జాతాపు భాష వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 72 భారత భాషల అభివృద్ధి కోసం ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో ఈ పుస్తకాలను ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ బృందంలో యూనివర్సిటీ మైసూర్ నుంచి ప్రొఫెసర్లు ఎల్ఎన్ ప్రేమ్ కుమార్, డి.రమేష్, భూషణ్, పార్వతీపురం ఐటిడిఎ ఎఎంఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు తప్పనిసరి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానికంగా పరిష్కారం కాని విద్యుత్ సమస్యలపై పరిష్కారం కోరుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం సిజిఆర్‌ఎఫ్‌లో ఫిర్యాదు చేయాలని ఆ సంస్థ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎంఆర్ నగరంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిల్లింగ్‌లో లోపాలు, విద్యుత్ తీగలు (కేబుల్స్) మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులు, కాలిపోయిన వాటి స్థానంలో మరమ్మతు చేయబడిన లేదా కొత్తగా అమర్చిన మీటర్లు కాలిపోవడం, విద్యుత్ ఓల్టేజ్ హెచ్చుతగ్గులు విద్యుత్ మీటర్ల లోపాలు, కొత్త విద్యుత్ సర్వేసులు, అదనపులోడు మంజూరు, యజమాని పేరు, కేటగిరి, ఇతర మార్పిడి అంశాలు, విద్యుత్ వినియోగదారుల బిల్లుల్లో లోపాలు సరి చేసేందుకు బిల్లుల చెల్లింపు తర్వాత, విద్యుత్ సరి చేయుట సరఫరా పునరుద్ధరణ కారణమైన అంశాలను వివరించారు. సాధారణ విద్యుత్ సరఫరా నిలిపివేత (గ్రిడ్ ఆదేశాలకు లోబడి) మినహా ఏ సమస్యలైనా ఈ న్యాయస్థానంలో పరిష్కరించబడి వినియోగదారులకు న్యాయం చేయబడుతుందని అన్నారు. స్థానికంగా విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు సమస్యను పరిష్కరించనప్పుడు న్యాయస్థానం దృష్టికి తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా తీసుకెళ్లవచ్చున్నారు. న్యాయ స్థానం ఇరువురి వాదనలు విని, వినియోగదారునికి సమస్య పరిష్కారంతో పాటు జాప్యానికి గానూ పరిహార రుసుం కూడా చెల్లించేలా తీర్పు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విలియం కేరి, విద్యుత్ అధికారులు, ఫోరం సభ్యులు వి.జనార్ధనరావు, ఎం.శ్రీనివాసరావు, ఆర్.సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యనారాయణ

నాదెండ్లను కలిసిన మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


మనోహర్‌తో మల్లేశ్వరరావు(కుడి)

జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కురుపాం నియోజకవర్గం సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జనసేన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణ గురించి ఆయనకు వివరించారు. 2024 ఎన్నికల్లో జనసేన, టిడిపి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని మనోహర్ సూచించినట్టు మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అరకు పార్లమెంట్ అధ్యక్షులు వి.గంగులయ్య పాల్గొన్నారు.

బడ్జెట్ అంతా అంకెల గారడీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగానే కనిపిస్తోందని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి అన్నారు. ఆమె గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయాంలో తీసుకొచ్చిన ప్రతీ స్కీమ్ ఓ స్కామ్‌గా మారిందని విమర్శించారు. ధరల పెంపు, పన్నుల భారం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెంచిన జగన్ సర్కార్ విద్యుత్ ఛార్జీల వడ్డనలో ఎక్కడా రాజీపడలేదన్నారు. విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లలో రూ. వెయ్యి కోట్ల అవినీతి, నాడు నేడు పేరుతో స్కూల్లకు రంగులు వేసి రూ.3 వేల కోట్ల అవినీతి చేశారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీకి బడ్జెట్‌లో నిధులు అంతంత మాత్రమే కేటాయించిందన్నారు. ఇలా ప్రజలకు అవసరమైన దేనికి కేటాయింపులు లేవన్నారు. ఈ సమావేశంలో అరకు పార్లమెంటరీ ఎస్‌టి సెల్ కార్యదర్శి నిడదవల కృష్ణ బాబు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

డి వార్మింగ్ డేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎంపిడిఒ ఈశ్వరరావు అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేయాలన్నారు. సీతానగరం పిహెచ్‌సి పరిధిలో జరుగు కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. సమావేశంలో ఎఒ ఎఎల్‌ఎస్ ప్రసాద్, వైద్యాధికారులు పావని, సునీల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వన్‌ధన్ కేంద్రాల్లో ఖర్చులపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల మండలాల్లో వన్‌ధన్ కేంద్రాల్లో ఖర్చుపెట్టిన నిధులపైన పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఐటిడిఎ పరిధిలో గల కొమరాడ, సాలూరు, పాచిపెంట, మక్కువ, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం, పార్వతీపురం మండలాల్లోని మహిళలకు గాను వన్‌ధన్ కేంద్రాల ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు సక్రమంగా వినియోగించకుండా బ్యాంకులకే పరిమితం య్యాయని విమర్శించారు. అందులో కొంతవరకు నిధులు గిరిజన మహిళా సంఘాలకు ఖర్చు పెట్టినా అవి సక్రమంగా చేయలేదన్నారు. ఈ విషయమై గతంలో ఐటిడిఎ పిఒకు పలుమార్లు వినతిని అందజేసినా స్పందన లేదన్నారు. కావున వెంటనే వన్‌ధన్ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన నిధులపై దర్యాప్తు చేపట్టాలని, నిధులు ఎంత ఖర్చు అయ్యింది, ఇంకా ఎంత మిగిలి ఉన్నది అన్న విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

12న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 12న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ జగదీష్ కుమార్ తెలిపారు. ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి 27 పంచాయతీల్లో సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

గిరీష్ కులంపై దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్ గ్రామానికి చెందిన గేదెల గిరీష్ తండ్రి నారాయణరావు కులంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిటి నాగేశ్వరరావుకు గురువారం ఎపి ఆదివాసి వికాస్ పరిషత్ జిల్లా అధ్యక్షులు అరిక ధర్మారావు, సభ్యులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేదెల గిరీష్

డిటికి వినతినిస్తున్న ఆదివాసి నాయకులు

అనే వ్యక్తి బిసి కులానికి చెందిన వాడని కానీ ఎస్‌టి కులం సర్టిఫికెట్ పొంది ప్రొవిజన్ శాఖలో ఎస్‌జిటి ఉద్యోగం చేస్తున్నాడని గతంలో కూడా ఇదే లెటర్ హెడ్‌తో రెవెన్యూ శాఖకి వినతిపత్రం అందించామని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారని తెలిసి ఆయన ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం కోసం అర్జీ పెట్టుకున్నారని రెవెన్యూ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి వారికి ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసి వికాస్ పరిషత్ సభ్యులు పి. ప్రసాద్, బి రామ్మూర్తి, ఎం. పాపారావు, ఎం. మోహన్‌రావు, యు. ఆదినారాయణ, కె. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రగతి హైస్కూల్లో గురువారం పాలకొండ అగ్నిమాపక ఎస్ఎఫ్‌ఒ జామి సర్వేశ్వరరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే చుట్టు పక్కల విద్యార్థులు తోటి విద్యార్థులను ఎలా బయటకు తీసుకువెళ్లాలో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాద నివారణలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సంభాన శ్రీనివాసరావు, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

చిట్టపూడివలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలసలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పవిత్ర, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకున్న మాలయ్య

ప్రజాశక్తి - సీతంపేట

టిడిపి మేనిఫెస్టో గురించి వివరిస్తున్న మాలయ్య

మండలంలోని శంభాం పంచాయతీ బొమ్మిడి గూడ గ్రామంలో టిడిపి అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపిపి సవర మాలయ్య స్థానిక సమస్యలు, పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. గిరిజన సమస్యలు అధికారుల వద్దకు తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలను మోసం చేసిన వైసిపికి బుద్ధి చెప్పి టిడిపికి పట్టం కట్టాలన్నారు. అనంతరం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు టిడిపి మేనిఫెస్టో గురించి వివరించారు. ఆరు అంశాలు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. గిరిజనులకు టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆయనతోపాటు జనసేన యువ నాయకులు రంగనాథ్, టిడిపి నాయకులు రామ్, నీలయ్య, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ఆహార కమిషన్ పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని బెలగాం వద్ద చౌక ధరల దుకాణాన్ని, అంగన్వాడీ కేంద్రం, మున్సిపల్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు స్వయంగా పదార్థాలను వడ్డించారు. స్టోర్ రూంలో సరుకుల నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, చెక్కీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాడు నేడు కింద అభివృద్ధి చేసి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి నాణ్యమైన విద్యతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తుందని అన్నారు. అంతకుముందు కొత్తవలస పెద్దవీధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి జగనన్న గోరుముద్ద పథకం అమలు, సరుకుల నిల్వ, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వండిన వంటకాల స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ఎంత మంది బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం, టి.హెచ్.అర్ అందిస్తున్నది వివరాలను ఆరా తీశారు. రక్తహీనత లోపం తలెత్తకుండా బలవర్ధకమైన ఆహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. పథకాల అమలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు జరిగేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బెలగాంలోని చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆర్.శివప్రసాద్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, జిల్లా మధ్యాహ్న భోజన పథకం సహాయ సంచాలకులు పి.దామోదర రావు, జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి వై.రామయ్య, జిల్లా లీగల్ మెట్రాలజి ఇన్స్పెక్టర్ కె.రత్నరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పార్వతీపురం: పిల్లలకు భోజనం వడ్డిస్తున్న కాంతారావు

కురుపాం: మండల కేంద్రంలో గల ఎస్సీ, బీసీ, ఎస్టీ, మహాత్మ జ్యోతిబాపూలే హాస్టలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ బి.కాంతారావు గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లో మెనూ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డెన్ శ్రీనివాస్‌కు మెమో జారీ చేయమని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మహాత్మ జ్యోతిబాపూలే హాస్టల్లో మెనూ ప్రకారంగా వండలేదని, బీసీ హాస్టల్లో వట్టి రసం సక్రమంగా ఉండలేదని సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వంటలను మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పోస్ట్ మెట్రిక్ బాలుర గృహాన్ని సందర్శించి చెక్కీలు పురుగు పట్టినవి, బియ్యం 550 కేజీలు తక్కువ ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ పాఠశాలలో సందర్శించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి విద్యా ప్రమాణాలు మెరుగుపరచుకోవడానికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి శివప్రసాద్, సంబంధిత అధికారులు డిఎం నాయక్, ఏఎం చిన్నికృష్ణ, ఎస్సీ బీసీ వెల్ఫేర్ అధికారులు, తహశీల్దార్ వేణుగోపాల్,అర్ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

ఆ గ్రామాల విలీనం జరగదు : వైసిపి

ప్రజాశక్తి- సాలూరు

మున్సిపాలిటీకి సమీపంలో ఉన్న కూర్మరాజుపేట, జీగిరాం, నెలిపర్తి గ్రామాల విలీనం జరగదని, ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు చెప్పారు. గురువారం వారు స్థానిక రామాథియేటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయామంలోనే ఆ గ్రామాల విలీనం ప్రతిపాదన తెరపైకి వచ్చిందని, అప్పుడే గ్రామస్తుల వ్యతిరేకత కారణంగా ఆగిపోయిందని తెలిపారు. విలీన ప్రక్రియ అనేది చాలా పెద్ద కార్యక్రమమని, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ తీర్మానాల ఆమోదం పొందిన తర్వాతనే జరుగుతాయని చెప్పారు. గ్రేడ్ -1 మున్సిపాలిటీగా మార్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం హయామంలోనే ప్రతిపాదన తెరపైకి వచ్చిందని గుర్తు చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర అభిప్రాయం మేరకు ప్రజలకు నష్టం చేసే ఏ కార్యక్రమమైనా నియోజకవర్గంలో జరగదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, వైసిపి నాయకులు లింగాల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల స్ట్రాంగ్ రూం ఏర్పాట్లను పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ గురువారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూం ఏర్పాటు, అందుకు గల సౌకర్యాలను పిఒ పరిశీలించారు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూం అవసరాలు, భద్రత తదితర అంశాలను పరిశీలించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎన్నికల ఉప తహశీల్దార్,పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని ఇప్పలవలస, జోగింపేట, నిడగల్లు, నీలకంఠాపురం, గుడ్డుపేట పోలింగ్ కేంద్రాలను పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిమిత్తం అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు, లైటింగ్, మరుగుదొడ్ల కోసం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. ఆమె వెంట తహశీల్దార్ జిబి జనార్ధన్‌రావు, ఎంఇఒ జి.సూర్యదేవుడు, ఎన్.శ్రీనివాసరావు పంచాయతీ, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలే మిన్న

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రైవేటు కాలేజీలు కన్నా ప్రభుత్వ కళాశాలలే మిన్న అన్న నినాదంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.రామారావు ఆధ్వర్యంలో అధ్యాపకులు 7 బృందాలుగా ఏర్పడి మండలంలోని గిరిజన సంక్షేమ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళ్లి ప్రచారం చేశారు. పార్వతీపురం ప్రభుత్వ కళాశాలలో చేరాలంటూ పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులకు అధ్యాపకులు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల విశిష్టతను వివరిస్తూ విశాలమైన తరగతి గదులు, నిష్ణాతులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యా బోధన, డిజిటల్ తరగతుల ద్వారా మేలైన విద్యా బోధన, ఆధునిక పరికరాలతో సంపూర్ణమైన లేబొరేటరీల ద్వారా ప్రయోగాల నిర్వహణ, మౌలిక సదుపాయాలతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్పోర్ట్స్‌లో పాల్గొనేందుకు ప్రత్యేక శిక్షణ, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా బోధన, ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు హాస్టల్ సదుపాయం, నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణలో తరగతుల నిర్వహణ, విజ్ఞాన సముపార్జన కోసం అధునాతన సదుపాయాలతో కూడిన గ్రంథాలయం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే దూరప్రాంతాల విద్యార్థులకు ప్రభుత్వ బస్సు పాస్ సౌకర్యం, విద్యార్థులందరికీ అమ్మఒడి వంటి పథకాల వర్తింపు, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, బాల బాలికలకు వేర్వేరుగా విశాలమైన మరుగుదొడ్ల సదుపాయాలు ఉన్న ప్రభుత్వ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, సుకన్య, శాంతి, ధనలక్ష్మి, తేజ, తవిటి నాయుడు, లక్ష్మణరావు, రామకృష్ణ, సత్యనారాయణ, శర్మ, కైలాష్, రవికాంత్, వెంకటేశ్వరరావు, బాబ్జీరావ్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: విద్యార్థులకు సూచనలు చేస్తున్న అద్యాపకులు

కురుపాం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చే ఏడాదిలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం కళాశాల అధ్యాపకులు గురువారం కురుపాం జిల్లా పరిషత్, మహాత్మ జ్యోతిబాపూలే, శివన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అధ్యాపకులు మాట్లాడుతూ కళాశాల ఆవశ్యకతలు, తరగతి గదుల, గ్రూపులు, వసతి సౌకర్యాలు, ల్యాబ్‌లు అక్కడ అందిస్తున్న విద్యా విధానం గూర్చి వివరించి తప్పనిసరిగా అందరు విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లలిత, రామమోహనరావు, మురళీకృష్ణ, రామకృష్ణ, ఎల్లంనాయుడు, నిర్మలాజ్యోతి స్వప్న, సతీష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు పూలమొక్కను ఇస్తున్న డిఎస్‌పి

ఆర్‌డిఒను కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వి.వెంకటరమణను డిఎస్‌పి జివి కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకొండ డివిజన్‌లో శాంతిభద్రతల స్థితిని ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇరువురు అధికారులు రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి చర్చించారు. పరస్పర అవగాహనతో ఎన్నికలను సమన్వయంతో పూర్తిచేసేందుకు అవసరమైన విషయాలను చర్చించారు.

ఉద్యమంగా భూసార పరిరక్షణ : ఎడి

ప్రజాశక్తి - పాచిపెంట

విద్యార్థులు నేల నీరు పోషకాలు పంటల వంటి వాటిపై అవగాహన విద్యార్థి దశ నుంచే పెంచుకోవాలని భూసార పరిరక్షణను ఒక ఉద్యమంగా స్వీకరించాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో సరాయివలసలో గల ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో భూసార పరీక్షలు భూసార పరిరక్షణ అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విచక్షణా రహితంగా ఎరువులు వాడడం, సరైన సాగు విధానాలను పాటించకపోవడం, ప్రతి సీజన్లో ఏళ్ల తరబడి ఒకే పంట పండించడం, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు వేయకపోవడం వంటి అనేక కారణాల వల్ల భూసారం పూర్తిగా క్షీణించిందని, దీనివల్ల పంటల్లో అనేక పోషకాలు లోపించడం వల్ల ఆహారాన్ని తీసుకోవడం వల్ల మనుషుల్లో పోషక లోపాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా భూసార పరీక్షలు జరిపి వాటికి అనుగుణంగా ఎరువులు వాడడం, పంటల పండించడం వంటి వాటిపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. విద్యార్థి దశ నుంచే వీటిపై అవగాహన ఉండాలని తెలిపారు. అనంతరం ఏకలవ్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థులు కొన్నిచోట్ల మొక్కలు ఎందుకు ఆరోగ్యంగా పెరుగుతున్నాయి, మరికొన్ని చోట్ల ఎందుకు సరిగ్గా పెరగడం లేదన్న విషయాన్ని కూలంకుషంగా పరిశీలించాలని తెలిపారు. గ్రీన్ ఆర్మీ విద్యార్థులు దీనిపై మరింత దృష్టి పెడితే భూసార పరిరక్షణ, భూసార పరీక్షల ఆవశ్యకత సులువుగా అర్థమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖ రాజు మాట్లాడుతూ భూసార పరిరక్షణలో ప్రధానమైంది సేంద్రీయ పదార్థమని, ప్రకృతి సేద్య పద్ధతుల ద్వారా సేంద్రీయ పదార్థాన్ని పెంపొందించడం ద్వారా నవధాన్యాలు సాగు చేపట్టడం ద్వారా పంట మార్పిడి, అంతర్ పంటలు సాగు ద్వారా భూసారాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మట్టి నమూనాలు తీసే విధానం, భూ ఆరోగ్య కార్డులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసే విధానం ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎలు సాయి గణేష్, దినేష్, ప్రకృతి సేద్య సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం డిపో మేనేజర్ ఈఎస్‌కె దుర్గ, సూపర్‌వైజర్ మరిపి శ్రీనివాసరావు రోడ్డు భద్రత నియమాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఇదే అంశంపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపకులు జె రామారావు, టి రవికుమార్, సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం :రహదారి భద్రతపై ప్రతి డ్రైవర్‌కు అవగాహన ఉండాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యన్నారాయణ అన్నారు. గురువారం రావాడ జంక్షన్ వద్ద రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆటో, వ్యాను, లారీ డ్రైవర్లకు రహదారి భద్రతపై పాటించాల్సిన నియమాలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి డ్రైవర్ మద్యం సేవించి సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకుని రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ నెమ్మదిగా వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం రహదారి భద్రత నియమాలపై డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వాహన యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కురుపాం: మాట్లాడుతున్న అధికారి సత్యనారాయణ

టిడిపి నాయకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పాచిపెంట

పథకాలు వస్తాయంటూ మండలంలో పలు గ్రామాల్లో మాయ మాటలు చెప్పి వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్న టిడిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో వైసిపి మండల నాయకులు ఎస్సై పి.నారాయణరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదులు వారు పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. కొంతమంది టిడిపి నాయకులు గ్రామాల్లోకి వెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని, బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాల కింద పథకాలు మంజూరు చేస్తామంటూ పథకాలు రావాలంటే ఫోన్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు కావాలంటూ వ్యక్తిగత వివరాల సేకరిస్తూ మీ అకౌంట్లో డబ్బులు పడతాయని మాయ మాటలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలే లక్ష్యంగా వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నారని, ఇటువంటి చర్యలు వల్ల ప్రజలకు నష్టం చేకూరే ప్రమాదం ఉందని అన్ని కోణాల నుంచి దర్యాప్తు నిర్వహించి సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, నాయకులు పి.వీరమనాయుడు, దండి ఏడుకొండలు, మాదిరెడ్డి మధుసూదనరావు, కొల్లి రవీంద్ర, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల వైపే ప్రజల మొగ్గు : టిడిపి

ప్రజాశక్తి - బలిజిపేట

తెలుగుదేశం అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలవైపే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని నూకలవాడ, వెంగాపురంలో మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో గురువారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో టిడిపి మహిళ శక్తి పేరుతో ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలపై మహిళలకు, ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తప్పక టిడిపి వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వ అవినీతి, అరాచక పాలన చూసి పూర్తిగా ప్రజలు విసిగితే టిడిపి పార్టీలోకి

బలిజిపేట: గ్రామాల్లో పర్యటిస్తున్న టిడిపి ఇంఛార్జి

రోజురోజుకు భారీ ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, పెంకి రామ్మోహ్మనరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గుల్ల బాబ్జీ, టిడిపి నాయకులు శ్రీనివాసరావు, శేషగిరిరావు, రమణ, వైకె నాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : తెలుగుదేశం పార్టీతోనే ప్రజల భవిష్యత్తుకి భరోసా ఉంటుందని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. మండలంలోని పెద్ద గొత్తిలి పంచాయతీలో గల కైరాడ, డి.భారామణి, పెద్దగొత్తిలి గిరిజన గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టో పెట్టిన పథకాలు గూర్చి ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా ప్రజలంతా సహకరించి టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించడానికి సహకరించాలని కోరారు. టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతోందని చెప్పారు. వైసిపి ఒక్క అవకాశం అని చెప్పి ప్రజలను ఎంతగానో మోసం చేశారో ఆ నాలుగేళ్లలో అర్థమైందన్నారు. కార్యక్రమానికి మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మి, టిడిపి నాయకులు రాజు, తిరుపతి, గౌరీశంకర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం పెద్దలు

ముస్లిముల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా ముస్లింల మత పెద్దగా సయ్యద్ ఇబ్రహీం ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని శుభమస్తు కళ్యాణ మండపం వేదికవద్ద మన్యం జిల్లాకు చెందిన పార్వతీపురం, పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాలలో ఉన్న ముస్లిం సోదరులు ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముస్లిం సోదరులు వారి వారి ప్రాంతాలలో ఉన్న పలు సమస్యలు, జీవన విధానాలపై చర్చించుకుని జిల్లాలో ముస్లిం సోదరులు ఇస్లాం ధర్మం యొక్క ఆచరణ జీవన విధానాలు శాంతియుతంగా ఉండాలని, భావితరాల భవిష్యత్తు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని మత పెద్దలు బోధించారు. అనంతరం జిల్లాలో ఉన్న జామ్యా మసీద్ కమిటీ తరపున ప్రతి ఒక్కరిని ముందుకు నడిపించే మంచి వ్యక్తి, శాంతిపరుడు అయిన సయ్యద్ ఇబ్రహీం హుస్సేన్ (సునీల్) జిల్లా అధ్యక్షులుగా మత పెద్దలు నియమించుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సాలూరుకి చెందిన షేక్ హిమమ్ భాష, కార్యదర్శిగా కురుపాంకు చెందిన షేక్ జిలాని, జాయింట్ సెక్రెటరీగా ముక్తార్ భాష, ట్రెజరర్‌గా ఎస్.ఎమ్. జలాల్‌కు బాధ్యతలు అప్పగించారు.

పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

ఎఫ్‌ఎల్‌ఎన్ బృందం పర్యటన

ప్రజాశక్తి- పాలకొండ

పునాది అక్షరా స్యత, సంఖ్యాశాస్త్రం (ఫౌండేషన్ లిటరీ న్యూ మర్సీ), (ఎఫ్ఎల్ఎన్) రాష్ట్ర బృంద సభ్యులు గురువారం పలు పాఠశాలలను సందర్శి ంచారు. బృంద సభ్యులు పాండు రంగారావు, కె.అశోక్‌కుమార్‌లు మండల ంలోని ఎమ్. సింగుపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య ఎలా అమలు జరుగుతోంది, 1, 2వ తరగతుల పిల్లల ప్రతిభా పాఠవాలను పరిశీలించారు. పాఠశాలలో ఎఫ్ఎన్ఎల్ అమలు చక్కగా జరుగుతుందని గుర్తించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ఎన్. శివాజీని ఉద్యాయులు కె. సిహెచ్. అప్పలనాయుడులను అభినందించారు.

సామాజిక తనిఖీపై సమావేశం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022 - 23 ఆర్థిక సంవత్సరానికి గాను చేసిన పనులకు సోషల్ ఆడిట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ పి.భాను మాట్లాడుతూ రూ.20.79 కోట్లతో మండలంలో పనులు జరిగాయ న్నారు. 12,964 జాబ్ కార్డులతో 21 వేల మంది ఉపాధి కూలీలు పనిచేశార న్నారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందాలు జనవరి 18 నుంచి ఈ 7 వరకూ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించాయన్నారు. ఈ సమావేశంలో డుమా పీడీ కె రామచంద్రరావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎంపిపి బి. రమణమ్మ, శ్రీరామ నాయు డు, జెడ్‌పిటిసి ఎం బాబ్జి, ఎస్ఆర్పి తిరుపతిరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

శ్రీ జిల్లా కలెక్టర్ వారి టెండర్ ప్రకటన
పార్వతీపురం మన్యం జిల్లా, కలెక్టర్ వారి కార్యాలయం

2024 - సాధారణ ఎన్నికల దృష్ట్యా, శ్రీ జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, పార్వతీపురం మన్యం జిల్లా, కార్యాలయానికి ఈ క్రింది సూచించిన స్టేషనరీ వస్తువులు కొనుగోలు చేయు నిమిత్తం "స్వల్ప కాలిక" "సీల్డ్ టెండర్లు" ఆహ్వానించడమైనది. టెండర్లు ప్రకటన మరియు తదుపరి వివరములకు గాను సంప్రదించవలసిన ఫోన్ నెం. 08963-293046, 7395965674.

టెండర్లు స్వీకరించు స్థలం: పరిపాలనాధికారి, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, పార్వతీపురం మన్యంలో **తే.16.02.2024. మధ్యాహ్నం గం.02.00.**ల వరకు (కార్యాలయపు పనివేళలలో)

టెండర్లు తెరుచుస్థలం: శ్రీ సంయుక్త కలెక్టర్, పార్వతీపురం మన్యం వారి చాంబరు నందు **తే.16.02.2024.ది, సమయం: సాయంత్రం గం.04.00.**లకు.

గమనిక: ఇందలి ప్రతి కలెక్టర్ వారి కార్యాలయము, పార్వతీపురం మన్యం నందు గల నోటీసు బోర్డు నందు తగు సమాచారం నిమిత్తం టెండర్ నోటీసు పూర్తి వివరములకు **parvathipurammanyam.ap.gov.in** వెబ్ సైట్ ను సందర్శించవలెను.

సం/- ఆర్. గోవింద రావు, ఐ.ఏ.ఎస్.,
సంయుక్త కలెక్టర్ పార్వతీపురం మన్యం జిల్లా.